క్లుప్తంగా

నేడు మాంసం విక్రయాలు బంద్

పటమట(విజయవాడతూర్పు): గణతంత్ర దినోత్సవం సందర్భంగా గురువారం నగర వ్యాప్తంగా మాంసం విక్రయాలు బంద్ చేస్తున్నామని, కబేళా కూడా మూసేస్తున్నామని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. నగరంలోని అన్ని చికెన్, మటన్ షాపులు, చేపల మార్కెట్లు అన్నింటికీ సెలవు ప్రకటించామన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

గణతంత్ర వేడుకలు, తేనీటి విందుకు బందోబస్తు



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్‌లో జరిగే గణతంత్ర వేడుకలు, రాజ్ భవన్‌లో జరిగే తేనీటి విందు కార్యక్రమాలకు 1,600 మంది పోలీసు సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనర్ టి.కె.రాణా తెలిపారు. ఈ రెండు ప్రాంతాలను బుధవారం పరిశీలించిన అడిషనల్ డీజీలు రవిశంకర్‌అయ్యర్, డాక్టర్ శంకబ్రటబగ్చిలకు బందోబస్తు వివరాలను సీపీ రాణా వివరించారు. గణతంత్ర వేడుకలకు ఈ ఏడాది 400 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండానే వాహన రాకపోకలు దారి మళ్లిస్తున్నామన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావివ్వకుండా పూర్తి భద్రతా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏఎంసీ బలోపేతానికి కృషి



అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): నగరంలో ఆజాద్ ముస్లిం కమిటీ(ఏఎంసీ) బలోపేతానికి సభ్యులంతా కృషి చేయాలని ఏఎంసీ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ నాగుల్‌మీరా అన్నారు. ఆ కమిటీ నగర యూత్ ప్రధాన కార్యదర్శిగా పూర్ణానందంపేటకు చెందిన షేక్ గౌస్‌బాషాను ఎంపిక చేశారు. దీనికి సంబంధించిన నియామకపత్రాన్ని సింగ్‌నగర్‌లోని ఏఎంసీ కార్యాలయంలో బుధవారం ఆయన గౌస్‌భాషాకు అందజేశారు. ఏఎంసీ నాయకులు ఎండీ కాలేషా, ఎండీ హుఖ్, సయ్యద్ మౌలాలి, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.

విలేజి కంద్రికలో సిమెంటు రోడ్డు నిర్మాణం



పాయకాపురం(విజయవాడరూరల్): విజయవాడ నగరపాలక సంస్థ 64వ డివిజన్‌కు మంజూరు చేసిన లక్షా 20 వేల రూపాయల నిధులతో విలేజి కంద్రికలో సిమెంటు రోడ్డు నిర్మాణం పనులు బుధవారం చేపట్టారు. కార్పొరేటర్ యర్రగొర్ల తిరుపతమ్మ పనులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వీఎంసీ డివిజన్‌కు 20 లక్షల రూపాయలను మంజూరు చేసిందని, వాటితో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. రోడ్డు నిర్మాణం పనులను ఇంజినీరింగ్ అధికారులు సైతం పరిశీలించారు.

ప్రజల ఆశీస్సులే సీఎం జగన్‌కు కొండంత బలం



ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు, సుబ్బారావు తదితరులు

రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ప్రజల ఆశీస్సులే కొండంత బలమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 23వ డివిజన్ 93వ వార్డు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం బుధవారం నిర్వహించారు. సూర్యారావుపేటలోని వేమూరి వారి వీధి, జడగం వారి వీధుల్లో పర్యటించారు. డివిజన్ ప్రజలు ఎమ్మెల్యే విష్ణుకు స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. ప్రజల నుంచి సమస్యలపై వినతులు స్వీకరించారు. కొత్త ఓట్ల నమోదు, ఓటరు జాబితాల్లో మార్పులు చేర్పుల్లో బీఎల్‌ఓలు అప్రమత్తంగా వ్యవహరించాలని ఎమ్మెల్యే సూచించారు.

అభివృద్ధికి విశేష కృషి..

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విష్ణు మాట్లాడుతూ మూడున్నరేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై ప్రజలకు గట్టి నమ్మకం ఏర్పడిందన్నారు. సీఎం వైఎస్ జగన్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, నగదు బదిలీలు గతంలో ఏ ప్రభుత్వం అమలు చేయలేదని పేర్కొన్నారు. టీడీపీ హయాంలో అప్పటి ప్రతిపక్ష కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహించే డివిజన్లను పూర్తి నిర్లక్ష్యానికి గురి చేశారని మల్లాది విష్ణు ఆరోపించారు. కానీ ఈ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధికి విశేషంగా కృషి చేస్తున్నట్లు వివరించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన ఈ ప్రాంతం.. సీఎం వైఎస్ జగన్ పాలనలో ఓ మోడల్ డివిజన్ గా రూపుదిద్దుకుంటోందన్నారు. గత మూడున్నరేళ్ల కాలంలో డివిజన్‌లో రూ. 3.25 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. రూ.కోటి వ్యయంతో నూతనంగా నాలుగు రోడ్లను నిర్మించి ప్రారంభించామని చెప్పారు. 14వ ఆర్థిక సంఘం నిధులతో రహదారులను నిర్మిస్తున్నామన్నారు.

ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్న పవన్

రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభంజనాన్ని తట్టుకుని నిలబడే సత్తా ఏ ఒక్క రాజకీయ పార్టీకి లేదని ఎమ్మెల్యే మల్లాది విష్ణు స్పష్టం చేశారు. లోకేష్ యాత్ర గురించి టీడీపీ నేతలు చాలా ఎక్కువగా ఊహించుకుంటున్నారన్నారు. స్థానిక పరిస్థితుల దృష్ట్యా పోలీస్ అధికారులు పర్మిషన్లు ఇవ్వడం జరుగుతుందని.. అంతమాత్రాన పోలీస్ వ్యవస్థను టీడీపీ నేతలు టార్గెట్ చేయడం సరికాదన్నారు. అమాయకపు ప్రజల ప్రాణాలకు ముప్పు వాటిల్లేలా కనీస జాగ్రత్తలు పాటించకుండా సభలు, సమావేశాలు నిర్వహిస్తుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకోవాలా..? అని ప్రశ్నించారు. జీఓ నంబర్.1 ని చూసి ప్రతిపక్షాలు ఎందుకంత భయపడుతున్నాయో అర్థం కావడం లేదన్నారు. లోకేష్ తన పాదయాత్రను ఇచ్ఛాపురం దాటి ఒరిస్సా వరకు చేసుకున్నా.. వైఎస్సార్ సీపీకి వచ్చిన నష్టమేమీ లేదన్నారు. మరో వైపు ఆంధ్రుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా పవన్ కళ్యాణ్ మాట్లాడటం బాధాకరమని మల్లాది విష్ణు పేర్కొన్నారు. ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే నైతిక అర్హత పవన్‌కు ఏమాత్రం లేదన్నారు. చంద్రబాబు పాలనలో దుర్మార్గం, హత్యలు, మారణ హోమాలు జరిగినప్పుడు పవన్ ఎందుకు మాట్లడలేకపోయారన్నారు. టీడీపీ హయాంలో 23 మంది ఎమ్మెల్యేలను కొనుగోలు చేసినప్పుడు ప్రజాస్వామ్యం గుర్తుకురాలేదా..? అని ప్రశ్నించారు. దత్తపుత్రుడు వారాహి మీద, సొంత పుత్రుడు రోడ్డు మీద చంద్రబాబు ఇంట్లో కూర్చొని ఎన్ని కుయుక్తులు పన్నినా.. ప్రజలంతా సీఎం వైఎస్ జగన్ వెంటే ఉన్నారన్న విషయాన్ని గ్రహించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, డివిజన్ ఇన్‌చార్జి ఆత్మకూరు సుబ్బారావు, డీఈ గురునాథం, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, సీడీఓ జగదీశ్వరి, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణ మెరుగుపర్చాలి

కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు పారిశుద్ధ్య సమస్యను వివరిస్తున్న స్థానికురాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ)/పటమట(విజయవాడతూర్పు): డివిజన్‌లో పారిశుద్ధ్య నిర్వహణ విధానాన్ని మెరుగుపరచాలని నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. ఆయన క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం అధికారులతో కలిసి సర్కిల్–1 పరిధిలో గల 44, 51 డివిజన్లలోని విద్యాధరపురం నాలుగు స్తంభాల సెంటర్, వాగు సెంటర్, నెహ్రూ బొమ్మ సెంటర్ తదితర వీధులు, కొండ ప్రాంతంలో పర్యటించారు. ఆయా డివిజన్లలో పారిశుద్ధ్య నిర్వహణ విధానం, స్థానిక సమస్యలను పర్యవేక్షించి అధికారులకు పలు సూచనలు చేశారు. కొండ ప్రాంత వాసులకు రోడ్లు, డ్రెయిన్లు, మెట్లు, తాగునీటి సరఫరా తదితర వసతులపై ఆరా తీశారు. స్థానికులు ఇకపై చెత్తాచెదారం కాలువల్లో పడేయకుండా చూడాలని అధికారులకు సూచించారు. డివిజన్‌లో పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్దటంతో పాటు మెట్ల మార్గంలోగల వాటర్ పైప్‌లైన్లను కాంక్రీట్‌తో మూసివేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన 51వ డివిజన్ కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్‌తో కలిసి కొత్తపేట కేటీరోడ్‌లో పూర్తి చేసిన సీసీ రోడ్డును పరిశీలించారు. పనులు త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమానికి ఏపీ గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్, ఇతర ఐఏఎస్ అధికారులు హాజరు కానున్న దృష్ట్యా అక్కడ ఏర్పాట్ల పురోగతిని పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకుని పలు ఆదేశాలు ఇచ్చారు. కళాక్షేత్రం ప్రాంగణంలో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా ఏర్పాటు చేసిన మొక్కలను పరిశీలించి ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ పర్యటనలో కార్పొరేటర్ మరుపిళ్ల రాజేష్, జోనల్ కమిషనర్–1 కేటీ సుధాకర్, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సురేష్‌బాబు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యనారాయణమూర్తి, శానిటరీ సూపర్‌వైజర్ ఓబేశ్వరరావు, శానిటరీ ఇనస్పెక్టర్లు, శానిటరీ సెక్రటరీలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక అధికారి పరిశీలన

నగర పరిశుభ్రతలో భాగంగా పరిసరాల పరిశుభ్రతతో పాటు మురుగు కాల్వల నిర్వహణ కూడా సక్రమంగా జరగాలని స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్స్), కె.సత్యవతి, మలేరియా–6 పరిధిలోని గాంధీనగర్ సత్యనారాయణపురం ఏరియాలో పర్యటించి మురుగు కాలువల నిర్వహణ గురించి సూచనలు చేశారు. నూతన నిర్మాణాలు జరిగే ప్రదేశాల్లో భవన నిర్మాణ వ్యర్థాలు డ్రెయిన్లలో పడి మురుగునీరు పారుదలకు ఆటంకంగా మారుతున్నాయన్నారు. భవన నిర్మాణ యజమానులతో సంప్రదించి ప్రత్యామ్నాయం ఏర్పాటు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో బయాలజిస్ట్ సూర్యకుమార్, మలేరియా ఇన్‌స్పెక్టర్, శానిటేషన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

బాలకృష్ణ వ్యాఖ్యలపై సాంస్కృతిక సంస్థల నిరసన



మాట్లాడుతున్న చీదెళ్ల నాగేశ్వరరావు, చిత్రంలో విజయలక్ష్మి, ఆంజనేయరాజు, చిట్టిబాబు

విజయవాడ కల్చరల్: సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావుపై ఎమ్మెల్యే, సినీనటుడు బాలకృష్ణ చేసిన వ్యాఖ్యలపై నగరానికి చెందిన పలు సాంస్కృతిక సంస్థల ప్రతినిధులు నిరసన వ్యక్తం చేశారు. గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికలో బుధవారం అక్కినేని ఫౌండేషన్ ఆఫ్ ఇండియా, మహానటి సావిత్రి సంక్షేమ సంఘం, తెలుగు కళావాహిని, ఎక్స్‌రే సాహిత్యసేవా సంస్థ ప్రతినిధులు నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో బాలకృష్ణ వాడిన పరుష పదజాలంపై ఆవేదన వ్యక్తం చేశారు. అక్కినేని నాగేశ్వరరావు ఫౌండేషన్ జాతీయ అధ్యక్షుడు చీదెళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలుగు సినిమా చరిత్రలో అక్కినేని, ఎన్టీ రామారావు, ఎస్వీ రంగారావులు మూల స్తంభాలన్నారు. ఒకరు ఎక్కువ, మరొకరు తక్కువ అభిప్రాయం వారిలో లేదని, అహంకారంతో అక్కినేనిని దూషించిన బాలకృష్ణ తక్షణమే క్షమాపణ చెప్పాలన్నారు. రామారావు, నాగేశ్వరరావు అనేక సినిమాల్లో కలిసి నటించారని గుర్తు చేశారు. వారు ఏనాడు వ్యక్తిగత నిందలకు దిగలేదన్నారు. మహానటి సావిత్రి సాంస్కృతిక సంక్షేమ సంఘం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ అక్కినేని, రామారావు పరిశ్రమకు రెండు కళ్లని అక్కినేని గురించి తప్పుగా మాట్లాడటం సరికాదన్నారు. బాలకృష్ణ వెంటనే తన వ్యాఖ్యలను ఉప సంహరించుకోవాలని కోరారు. సమావేశంలో వివిధ కళాసంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, బోడి ఆంజనేయరాజు, చలపతిరావు బాలకృష్ణ వ్యాఖ్యలను ఖండించారు.

విద్యార్థులకు స్కాలర్‌షిప్ అందజేత



విద్యార్థికి చెక్కు అందజేస్తున్న ట్రస్ట్ నిర్వాహకులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ కేఎస్ఎన్ ప్రసాద్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పేద మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు పంపిణీ చేశారు. సూర్యారావుపేటలోని ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం స్కాలర్ షిప్‌లు అందజేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఫౌండేషన్ చైర్మన్ కిలారు స్వప్న మాట్లాడుతూ.. ఈచ్ వన్ హెల్ప్ వన్ అనే ఆశయంతో 2004లో కేఎస్ఎన్ ప్రసాద్ రూ.కోటి వ్యయంతో ఫౌండేషన్‌ను స్థాపించారన్నారు. తనతో కలిసి చదువుకున్న మిత్రులతో కలిసి మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్(ఎంఓఎస్‌టీ)పేరుతో రూ.1.09 కోట్ల మూలధనంతో మరో ట్రస్ట్‌ను 2012లో స్థాపించారన్నారు. ఆనాటి నుంచి ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లు అంజేస్తున్నామని చెప్పారు. ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కేఎస్ఎన్ మరణానంతరం ఆయన స్ఫూర్తిని కొనసాగిస్తున్నామన్నారు. జనవరి 25న ప్రసాద్ జయంతి రోజున విద్యార్థులకు చెక్కులు పంపిణీ చేస్తున్నామన్నారు. ఇందులో భాగం కేఎస్ఎన్ ఫౌండేషన్, మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ ట్రస్ట్ తరఫున 38 మంది విద్యార్థులకు రూ7.80 లక్షలు అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో మాంటిస్సోరి ఓల్డ్ స్టూడెంట్స్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వీరమాచినేని రంగప్రసాద్, సెక్రటరీ డాక్టర్ జాస్తి విజయకృష్ణ, జయరామ్, సి.రమేష్ పాల్గొన్నారు.

ఓటు హక్కు విధిగా వినియోగించుకోవాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎమ్మెల్యే విష్ణు, డెప్యూటీ మేయర్ శ్రీశైలజ, కార్పొరేటర్లు, అధికారులు



ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో ప్రతిజ్ఞ చేస్తున్న జమలపూర్ణమ్మ, విద్యార్థులు



పాఠకులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న గ్రంథాలయ అధికారి సంపత్‌కుమార్



మాట్లాడుతున్న ఎస్ఆర్ఆర్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఓటు అత్యంత శక్తివంతమైనదని, దానికి సరైన రీతిలో వినియోగించాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ టి.జమల పూర్ణమ్మ అన్నారు. బందరు రోడ్డులోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో బుధవారం 13వ జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న జమల పూర్ణమ్మ మాట్లాడుతూ.. ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలన్నారు. భారతదేశంలో జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవం జరుపుకుంటామని, ఈ రోజున ఓటు హక్కుపైనా, ప్రజాస్వామ్య వ్యవస్థపైనా ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కలిగించే విధంగా ఎన్నికల కమిషన్ కొన్ని ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకోవాలన్నారు. అనంతరం పాఠకులు, సిబ్బంది చేత ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి రమాదేవి, సిబ్బంది రాంబాబు, జె. శంకర్, ఫణిబాబు, దుర్గాంబ పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య వ్యవస్థకు జీవనాడి ఓటు హక్కు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య మనుగడకు ఓటు హక్కే కీలకమని రాష్ట్ర ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్, ఎమ్మెల్యే మల్లాది విష్ణు అన్నారు. 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగ్‌నగర్ ఆంధ్రప్రభకాలనీలోని జనహిత సదనం నుంచి సింగ్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వరకూ బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని ఎమ్మెల్యే కోరారు. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, నార్త్‌జోన్ తహసీల్దార్ చందన దుర్గాప్రసాద్, కార్పొరేటర్లు ఎండీ షాహీనాసుల్తానా, ఇసరపు దేవి, రాజారమేష్, ఎండీ హాఫీజుల్లా, ఉమ్మడి వెంకట్రావ్, అలంపూరు విజయ్, బెజ్జం రవికుమార్ పాల్గొన్నారు.

యువత అవగాహన కలిగి ఉండాలి..

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని చిత్తరంజన్ గ్రంథాలయ అధికారి పి.సంపత్‌కుమార్ పేర్కొన్నారు. సత్యనారాయణపురంలోని గ్రంథాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న సంపత్‌కుమార్ ముందుగా పాఠకులతో ఓటు హక్కు వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. దేశ భవిష్యత్తుకు యువశక్తి ఎంతో కీలకమని, ఓటు హక్కు కలిగిన ప్రతి పౌరుడు తమ ఓటు ద్వారా మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు పాల్గొన్నారు.

ఓటు వజ్రాయుధం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అత్యంత విలువైన ఆయుధమని ఓటు హక్కుపై ప్రతీ ఒక్కరూ అవగాహన పెంచుకోవటంతో పాటు సద్వినియోగం చేసుకోవాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్యలక్ష్మి అన్నారు. స్థానిక మాచవరం ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం రాజనీతిశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ బాలసుబ్రహ్మణ్యం అధ్యక్షతన ఓటరు దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె ఓటు హక్కు ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రాంగణంలోని గురుకుల సాంఘిక సంక్షేమ మహిళా కళాశాలలో బుధవారం జాతీయ ఓటరు దినోత్సవం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వల్లూరు నీరజ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య విజయానికి ఆధారమైన అమూల్యమైన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్‌లను సత్కరించారు. కళాశాల సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు.

కొత్త ఆలోచనలతో ఉన్నత శిఖరాలు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, వేదికపై ఎమ్మెల్యే విష్ణు, స్కూల్ యాజమాన్యం

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు కొత్త ఆలోచనలతో ప్రయత్నిస్తేనే ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు అన్నారు. సెయింట్ ఆన్స్ స్కూల్ 34వ వార్షికోత్సవ వేడుకలు సింగ్‌నగర్‌లోని ఆ పాఠశాల ఆవరణలో బుధవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ విచ్చేసి మాట్లాడారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ.. విద్య ద్వారా మాత్రమే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యపడుతుందని గ్రహించిన గొప్ప ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని, విద్యారంగ అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ముందుగా వారు జ్యోతి ప్రజ్వలన చేసి, శాంతి కపోతాలను ఎగురవేశారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. డెప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ, 59వ డివిజన్ కార్పొరేటర్ ఎండీ షాహీనా సుల్తానా, రెవ.సిస్టర్ రోజాపుష్పం, స్కూల్ ప్రిన్సిపాల్ అమలాపుష్పం, సిస్టర్ ప్రసన్న, సిస్టర్ సరోజ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకు అండగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం



జూపూడి ప్రభాకర్‌ను సత్కరిస్తున్న జేఏసీ ప్రతినిధులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అన్ని వర్గాలకు అండగా ఉంటుందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు అన్నారు. గాంధీనగర్‌లోని రమా ఫంక్షన్ హాలులో ఆంధ్రప్రదేశ్ క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ కార్యనిర్వాహక సమావేశం బుధవారం జరిగింది. ఈ సందర్భంగా జూపూడి ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద పాస్టర్లకు పారితోషకం ఇచ్చి ఆదుకుంటుందన్నారు. చర్చిల నిర్మాణానికి సహాయం చేస్తోందన్నారు. లిడ్ క్యాప్ చైర్మన్ కాకుమాను రాజశేఖర్ మాట్లాడుతూ.. క్రైస్తవులను అన్ని విధాలా ఆదుకుంటున్న వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని పిలుపునిచ్చారు. లిడ్ క్యాప్ డైరెక్టర్ కోనేరు సత్యప్రియ మాట్లాడుతూ జేఏసీ క్రైస్తవుల సమస్యల పరిష్కారంలో ముందుండాలన్నారు. జేఏసీ గౌరవ అధ్యక్షుడిగా జూపూడి ప్రభాకర్, గౌరవ సలహాదారుగా కాకుమాను రాజశేఖర్, న్యాయ సలహాదారులుగా డాక్టర్ కోనేరు సత్యప్రియ, పోతుల సురేష్‌ను ఎన్నుకున్నారు. అనంతరం జేఏసీ ఆధ్వర్యంలో అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో క్రిస్టియన్ జాయింట్ యాక్షన్ కమిటీ అధ్యక్షుడు డేవిడ్ మనోహర్ బిషప్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేదర సురేష్ కుమార్, ప్రభు కుమార్, నాగ మోహన్ సహదేవ్, యోహోషువా, రాజ్ కారణ్ సామ్యూల్, కెనడి జార్జి పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



పటమట 12వ డివిజన్‌లోని కృష్ణానగర్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ బుధవారం రాత్రి జరిగింది. మంత్రి మేరుగ నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్, ఎమ్మెల్యేలు కైలే అనిల్‌కుమార్, కొక్కిలిగడ్డ రక్షణనిధి, వైఎస్సార్ సీపీ నేతలు దేవినేని అవినాష్, బొప్పన భవకుమార్, స్థానిక నాయకులు పాల్గొని అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

పాయకాపురం(విజయవాడరూరల్): నున్న రూరల్ పోలీసు స్టేషన్ పరిధి రాధానగర్‌కు చెందిన వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఫిర్యాది షేక్ మహ్మద్ అలీ తండ్రి, మృతుడు షేక్ బాబు(52) గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్ద ఉంటున్నాడన్నాడు. మంగళవారం రాత్రి ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో బెడ్ రూమ్‌లో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని వేలాడుతున్నట్లు మృతుడి భార్య చూసిందన్నారు. మృతుడి కుమారుడు మహ్మద్ అలీ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అత్తింటి వేధింపులపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): వివాహితను వేధింపులకు గురి చేస్తున్న అత్తింటి వారిపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. కేఎల్ రావునగర్‌కు చెందిన శీల గౌరీకి 2020లో ప్రకాశం జిల్లా చీరాలకు చెందిన మేంద్రగుత్తి బాలరాజుకు ఇచ్చి పెద్దలు వివాహం జరిపించారు. వివాహం అయిన కొద్ది రోజుల తర్వాత భర్త, అత్త, ఆడపడుచులు వేధింపులకు గురి చేయడంతో బాధితురాలు పుట్టింటికి వచ్చింది. గౌరీని కాపురానికి తీసుకెళ్లకపోవడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

గణతంత్ర వెలుగులు



ఎంజీ రోడ్డులో విద్యుత్ కాంతులు



విద్యుత్ వెలుగులో రైల్వే స్టేషన్

గణతంత్ర వేడుకలకు నగరం ముస్తాబైంది. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రైవేట్ సంస్థలు, పార్కులను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ